క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఓ ఇంట్లి నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మాదాసు సుగుణ తన ఇంట్లో 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచింది.కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు.

ఆప్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మహేంద్రప్రసాద్ యాదవ్


మహేంద్రప్రసాద్ యాదవ్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర కన్వీనర్ సుధాకర్

హాలియా : ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన చేగొండి మహేందర్ ప్రసాద్ యాదవ్ నియమితులైయ్యారు. సోమవారం హైదరాబాద్ లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్ రాష్ట్ర కన్వీనర్ డి. సుధాకర్ అతడిని నియోజకవర్గ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ అన్సారీ, బూర రామ గౌడ్, మజీద్, అఫ్జల్, ఎండీ కుతుబుద్దీన్ తదితరులు ఉన్నారు.

పద్మవినోద్ సాగర్‌కు బంగారు నంది అవార్డు


పద్మవినోద్ సాగర్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

మిర్యాలగూడ టౌన్ : వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు గాను పట్టణానికి చెందిన వీపీ ఫౌండేషన్ చైర్మన్ ఉబ్బపల్లి పద్మ వినోద సాగర్‌కు జీసీఎస్ వల్లూరి గ్రూప్స్ ఆధ్వర్యంలో బంగారు నంది ప్రతిభా పురస్కారం అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంస్థ ఫౌండర్ వీఆర్ శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో ఆమెకు నంది అవార్డు ను అందజేసి ప్రతిభా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ పార్టీ అధ్యక్షులు కోదండరామ్, టీఎస్‌పీహెచ్‌సీఎల్ చైర్మన్ డాక్టర్ లైమన్‌బాబు, హ్యుమన్‌రైట్స్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కె. శ్రీనివాస్, ఆదర్శ కళా నిలయం చైర్మన్ చిర్యాల ప్రకాశ్, హెల్త్ టామణి ట్రస్ట్ చైర్మన్ లూర్థుజ్యోతి పాల్గొన్నారు.

చెత్త సేకరణలో సర్పంచ్


ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో చెత్తను తరలిస్తున్న బెజ్జికల్ సర్పంచ్ కోటిరెడ్డి

త్రిపురారం : పంచాయతీ కార్మికులు 12రోజులుగా సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో చెత్త పేరుకపోయింది. గ్రామంలో ఇతరులతో పనులు చేయిద్దామంటే కార్మికులు చేయనివ్వడం లేదు. దీంతో మండలంలోని బెజ్జికల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోటిరెడ్డి పంచాయతీ ట్రాక్టర్ నడుపుతూ సోమవారం గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.

ప్రయాణికులకు అన్నదానం


ప్రయాణికులకు అన్నదానం చేస్తున్న వాసవి, వనిత క్లబ్ మహిళలు

మిర్యాలగూడ టౌన్ : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అమావాస్య సందర్భంగా సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రంగా స్వరూప-శ్రీనివాస్, తిరునగరి రోజారాణి-మదన్ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమానికి వాసవీ క్లబ్ డిస్ట్రిక్ 104ఏ ఆరో రీజియన్ చైర్మన్, సిల్వర్ స్టార్ రీజియన్ చైర్మన్ రాయపూడి భవాని, జెడ్‌సీ భువనగిరి లావణ్య, ఆర్ఎస్ తిరునగరు పద్మావతి, వీరేవల్లి పద్మావతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. , అదే విధంగా ఉత్త మ డిపో మేనేజర్‌గా ఉత్తమ అవార్డు అందుకున్న పాల్‌ను ఆయా క్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రమాదేవి, లక్ష్మి, ఉషబాల, జి. అనిత, కోశాధికారి లత, రోజారాణి, ఇందిరా, రోజారాణి ఉన్నారు.

గ్రామాల్లో అందని పశువైద్యం!

- సబ్ సెంటర్లలో డాక్టర్ల కొరత
- ప్రధాన ఆస్పత్రుల్లోనే సేవలు
- ఇబ్బంది పడుతున్న పాడి రైతులు


చింతపల్లి పశువైద్యశాల


వైద్యశాలలో సిబ్బంది లేకున్నా అందుబాటులో ఉన్న మందులు

చింతపల్లి : వ్యవసాయ అనుబంధ రంగాల్లో పోషణ ఎంతో కీలకం... వ్యవసాయం తర్వాత రైతు కుటుంబాలు ఎక్కువగా ఆధారపడేవి పశుపోషణపైనే అలాంటి ప్రాధాన్యం కలిగిన పశుసంవర్ధక శాఖను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పశువుకు ఏదైనా జబ్బు చేసి పశువైద్యశాలకు తీసుకెళ్తే అందుబాటులో పశువైద్య అధికారి ఉండకపోవడంతో కింది స్థాయి సిబ్బందే వైద్యం చేస్తున్నారు. ఇది కేవలం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మాత్రమే అందుతుండగా సబ్ సెంటర్లలో పరిస్థితి అధ్వానంగా ఉంది. జబ్బు చేసి పశువైద్యశాలకు వెళ్తే వైద్య సిబ్బంది జాడ ఉండదు. ఏదైన అర్ధరాత్రి వస్తే స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యులను సంప్రదించి మూగ జీవాలకు వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అంతకుమించి సంరక్షణ భారంగా మారుతోంది. చింతపల్లి మండలంలోని నసర్లపల్లి, గడియగౌరారం, పోలేపల్లి రాంనగర్, కుర్మేడు, గొడుకొండ్ల సబ్ సెంటర్లలో పశువైద్య సిబ్బంది కానరావడం లేదు. మండలంలో అధికంగా ఆవులు, గేదెలు ఉన్నాయి. వీటితో పాటు మేకలు, గొర్రెల పెంపకందారులు కూడా అధికంగా ఉండడంతో పశువైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. కాని తగిన సంఖ్యలో పశువైద్య సిబ్బంది లేకపోవడంతో పెంపకందారులు అవస్థలు పడుతున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో లేకపోగా కొన్ని చోట్ల డిప్యూటేషన్లపై పని చేయాల్సిన వారు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆరుబయటే మందులు..

మండల కేంద్రంలోని పశువైద్య కార్యాలయంలో మండల పశువైద్య అధికారి వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుండగా కిందిస్థాయి సిబ్బంది మాత్రం స్థానికంగా ఉంటూ జీవాల పెంపకందారులకు సేవలు అందిస్తున్నారు. వాస్తవానికి పశువైద్యాధికారి సూచనల మేరకు కింది స్థాయి సిబ్బంది పశువైద్యం చేయాల్సి ఉంటుంది. కాని వైద్యులు అందుబాటులో ఉండని కారణంగా కిందిస్థాయి సిబ్బంది తమకు తెలిసీ తెలియని వైద్యం చేస్తుండడంతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కార్యాలయంలోని ఆరుబయటే పశువులకు సంబంధించిన మందులను ఉంచి వైద్యులు అందుబాటులో ఉండకుండా పెంపకందారులు అధికారులను ఫోన్‌లో సంప్రదిస్తే ఎర్రబాటిల్, తెల్లబాటిల్, ఒక్కో మూత తీసుకొని పశువులకు వేయాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీంతో రైతులు చేసేది లేక వారి సూచనల మేరకు మందులను వేస్తున్నారు.

ఇష్టానుసారంగా విధులు

మండల కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సిన పశువైద్యాధికారులు, కింది స్థాయి సిబ్బంది కనీసం కార్యాలయానికి తాళాలు కూడా తీసే పరిస్థితి కనిపించడం లేదు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ రైతులు మూగ జీవులతో ప్రదర్శనలు చేస్తున్నా వైద్యాధికారులు మాత్రం కార్యాలయానికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. మండల కేంద్రంతో పాటు పోలేపల్లి, రాంనగర్‌లో ఉన్న ప్రధాన సెంటర్లలోనే పశువైద్య అధికారులు అందుబాటులో లేరంటే మినీ సెంటర్ల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

> **మూడు కేంద్రాలకు ఇన్‌చార్జ్**
>
> చింతపల్లి మండల కేంద్రంతో పాటు పోలేపల్లి రాంనగర్, మర్రిగూడ, శివన్నగూడెం పశువైద్య కేంద్రాలకు కూడా ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉంది. అలా లేకపోతే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం
>
> – జి.జైపాల్ మండల పశువైద్యాధికారి

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు


పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌లు అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని గుడిపల్లి ,పీఏపల్లి ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ రక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు. పేద మధ్యతరగతి వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, వైస్‌ఎంపీపీ సరితానర్సింహ, శేఖర్‌రెడ్డి, సైదమ్మ శ్రీనివాస్, శ్రీను, అంజిరెడ్డి, పరమేష్, యాదగిరి, చందూనాయక్ పాల్గొన్నారు.

24గంటల కరెంటుతో రైతుల జీవితాల్లో వెలుగులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 24గంటల ఉచిత విద్యుత్ రైతుల జీవితాల్లో వెలుగులు నింపిందని, ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్‌లోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే. ఉచిత విద్యుత్‌ను రద్దు చేయాలన్న దుర్మార్గపు ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నదని తెలిపారు. విద్యుత్ ఇవ్వకుండా రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ దండగ అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూనాయక్, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేందర్ రెడ్డి, నేనావత్ రాంబాబునాయక్, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన


హాలియా : బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం అనుముల మండలంలోని రామడుగు రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేదన్నారు. సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు కింద ఎకరానికి రూ. 10వేలు పెట్టుబడి సహాయం అందిస్తున్నారు. రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌దేన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కూరాకుల వెంకటేశ్వర్లు, యనమల సత్యం, సర్పంచ్‌లు వెంకట్రామ్ రెడ్డి, కిరణ్, వెంకటేశ్వర్లు, రాములు, విజయ్, వెంకట్‌రెడ్డి, ధర్మారెడ్డి, మాలే వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎంపీటీసీలు ఊర్లగొండ వెంకటయ్య, రమేష్ యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజు గౌడ్, డెరెక్టర్ సురభి రాంబాబు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్య గూడెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భగత్ పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దోరేపల్లి వెంకటేశ్వర్లు, అంజయ్య, రమేశ్‌తో పాటు మరి కొంత మంది కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నాగయ్య, పెద్దిరాజు, మార్కెట్ డైరెక్టర్ హరికృష్ణ, కోఆప్షన్ సభ్యుడు సలీం, రామకృష్ణ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

త్రిపురారం : కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని త్రిపురారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి తెలిపారు. మండలంలోని బడాయి గడ్డ గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నాగనాయక్‌కు ఇటీవల జరిగిన ప్రమాదంలో చేయి విరిగింది. సమాచారం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు గ్రామంలోని నాగా నాయక్ ఇంటికి వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, జానయ్య పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం


శివాజీకి ఆర్థిక సాయం అందజేస్తున్న రవి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని పొట్టివాని తండాకు చెందిన రమావత్ శివాజీ నీట్‌లో ఆలిండియా 196వ ర్యాంక్ సాధించాడు. పై చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. సోమవారం మండలంలోని రామన్న గూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమావత్ రవి నాయక్ రూ. 5వేలు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి సరస్వతి పుత్రుడిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయదస్రూ నాయక్, రమావత్ వినోద్, రమేష్, శ్రవణ్, రాజు, అశోక్ పాల్గొన్నారు

దామరచర్లలో 'ఇంటింటికి కాంగ్రెస్'

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాలం వెంకన్నయాదవ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం సాయిల ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 'యూత్ జోడో బూత్ జోడో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.అజారుద్దీన్, నాయకులు మోహన్‌నాయక్, దుర్గా, కోటిరెడ్డి, చెన్నయ్య, కిషన్‌నాయక్, నాగరాజు, మల్లయ్యయాదవ్, సతీష్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

నల్లగొండ టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందులకు కార్మిక లోకం సిద్ధం కావాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా దినోత్సవ స్ఫూర్తితో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తుమ్మల వీరారెడ్డి, యరగాని నాగన్న, పల్లా దేవేందర్‌రెడ్డి, బొంగరాల నర్సింహ, అవుట రవీందర్, అంబటి సోమన్న, నూనె రామస్వామి చినపాక లక్ష్మీనారాయణ, నగేష్, వెంకటేశ్వర్లు, ఎండీ సయీద్, వెంకన్న, సత్తయ్య, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


పెద్దవూర : ఆర్థిక సాయం అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

పెద్దవూర : మండలంలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న 50మంది నిరుపేద కుటుంబాలకు సోమవారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. జయరాంతండా, కోమటికుంట తండా, బాసోనిబావితండా, ఎర్రకుంటతండా, ఊట్లపల్లి, గేమ్యానాయక్ తండా, పులిచర్ల, సంగారం, పిన్నవూర, పోతునూరు, ఏనెమీదిగూడెం గ్రామాల్లో ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అన్నివేళలా బుసిరెడ్డి ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పులిమాల కృష్ణారావు, సర్పంచ్‌లు లింగయ్య, ప్రభావతి సంజీవరెడ్డి, నాయక్, శంకర్ నాయక్, నరేష్, తుమ్మ శ్రీను, అనితాశ్యాంరెడ్డి, అంకతి వెంకటరమణ, జనార్దన్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంటయ్య, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి


త్రిపురారంలో సాగర్ రోడ్డుపై ధర్నా చేస్తున్న కార్మికులు


దామరచర్లలో భిక్షాటన చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

పెద్దవూర : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు దొంతల నాగార్జున అన్నారు. పన్నెండు రోజులు పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన సోమవారం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, రంగారెడ్డి, ప్రభాకర్, వెంకటయ్య, సత్యం, రాజారావు, సైదులు, బిక్షం, కృష్ణ, యాదయ్య, రాములు, అలివేలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దామరచర్ల మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్, వాడపల్లి శ్రీరాములు, కె.నాయుడు, లక్ష్మయ్య, నాగయ్య, కృష్ణారెడ్డి, పూలమ్మ, జాలమ్మ పాల్గొన్నారు.

దేవరకొండ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. సోమవారం ఏఐటియూసి డివిజన్ నాయకులు జూలూరి వెంకట్రాములు సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. 12 రోజులుగా కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దిగివచ్చి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలమోని మల్లయ్య, అయోధ్య, వీరన్న, ఎల్లేశ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు బీఎస్పీ మద్దతు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేర్చాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమళ్ల వెంకటేశ్ అన్నారు. 12రోజులుగా పంచాయతీ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు సోమవారం బీఎస్పీ పూర్తి మద్దతు తెలిపింది.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజవకర్గ ఉపాధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, పెద్దవూర మండల అధ్యక్షుడు ముత్యాలు, సుధాకర్ పాల్గొన్నారు.

నిడమనూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె 12వ రోజుకు చేరింది. మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులకు టీడీపీ నాయకులు మువ్వ అరుణ్‌కుమార్, మంద తిరుపతయ్యలు సోమవారం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు, సత్యనారాయణ, విజయ్, రాములు, వెంకటయ్య, భాగ్యమ్మ, లింగయ్య, నరసింహ, ముత్యయ్య, సైదమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : గ్రామ పంచాయితీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు కార్మికులను చర్చలకు పిలిచి వారి సమ్మెను విరమింపజేయాలని కులవివక్ష పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు రెమడాల పరశురాములు అన్నారు. 12రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సోమవారం సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. అలాగే బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కోడిరెక్క మల్లయ్య, తక్కలపల్లి ఏసుబాబు, పాపారావు, అచ్చాలు, శివకుమార్, రాజ్‌కుమార్ , బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాలోతు దశరథనాయక్ కార్మికులు బుచ్చయ్య, నారాయణరెడ్డి, వీరయ్య, దావీద్, సైదులు, ఏసు, శివ, మల్లయ్య, సైదమ్మ, శదేవి తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె సోమవారం 12వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, హెచ్‌ఆర్‌సీ సంఘం నాయకులు వేర్వేరుగా మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌సీ సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గౌస్‌పాషా, పెద్దిశెట్టి సత్యనారాయణ, జున్ను, దయ, ఆరిఫ్, అల్తాఫ్, శ్రీనివాస్, నరేశ్, కుంభం గిరి, నాగరాజు, బొజ్జనాయక్, డానియల్, ముదిగొండ యాదగిరి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, బుడిగ వెంకటేశ్, చందు, బాబులాల్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల అరెస్ట్

డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె సోమవారం 12వ రోజు కొనసాగింది. కార్మికుల సమ్మె ప్రభావంతో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయింది. దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శి వీరబాబు సోమవారం తెల్లవారుజామున వేరే కార్మికులతో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న సమ్మెలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు వారిని అడ్డుకున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పనులను అడ్డుకున్న పంచాయతీ కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం

త్రిపురారం : గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నా పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న ధర్నా సోమవారం 12వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు ర్యాలీగా వెళ్లి సాగర్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మండల కేంద్రంలో 2కిలో మీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం కలగడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సీపీఎం పార్టీ, కుల వివక్ష పోరాట సమితి, ధర్మ సమాజ్ వాధి పార్టీ నాయకులు ధార్నాకు మద్దతు ప్రకటించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దైద శ్రీను, కేవీపీఎస్ నాయకులు వెంకన్న, మండల అధ్యక్షుడు దేవోజు సురేష్, పడిశల ముత్తమ్మ, అల్లాడి శ్రీను, మేకల సైదులు, ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెంటయ్య, గంగమ్మ, భద్రదమ్మ, హుస్సేనమ్మ, చింతల సైదులు, సత్యనారాయణ, సాలమ్మ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు


తిరుమలగిరి : పంచాయతీ కార్మికులకు మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు


కొండమల్లేపల్లి : అరెస్టయిన పంచాయతీ కార్మికులు

జైవీర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


హాలియా : జైవీర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హాలియా : ఎమ్మెల్యే నోముల భగత్‌పై సోషల్ మీడియాలో కుందూరు జైవీర్‌రెడ్డి ఫొటోతో కూడిన అనుచిత పోస్టులు పెట్టినందుకుగాను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లను పెట్టి కుందూరు జైవీర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాన సెంటర్‌లో కుందూరు జైవీర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయ కులు లారీల్లో పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తూ వ్యాపారం చేసేవారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత సీఎం కేసీఆర్ పాలనలో సాండ్ టాక్సీని అమల్లోకి తీసుకువచ్చి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పేద ప్రజలకు కూడా ఉపాధి కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లగొండ సుధాకర్, ప్రసాద్ నాయక్, దుర్గారావు, జింకల ప్రసాద్, జానపాటి శ్రీను, ఈదయ్య, జానపాటి సైదులు, మహేష్, సాయి, గ్రామ మహిళ నాగేంద్రమ్మ ఉన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

నల్లగొండ టౌన్ : తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు వారం రోజులుగా జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షలు సోమవారం కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎండీ సత్తార్, ఎల్లయ్య, హనీఫ్, యాదగిరి, పూలమ్మ, లింగయ్య, నాగయ్య, ఇస్మాయిల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రం లక్ష్మమ్మకు కౌన్సిలర్ల నివాళి

హాలియా : పీఆర్‌టీయూ సంఘం అనుముల మండల అధ్యక్షుడు, గుర్రం రవి మాతృమూర్తి లక్ష్మమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న హాలియా మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, జిల్లా కౌన్సిలర్ల ఫోరం చైర్మన్ వర్ర వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్ పట్టణంలోని బాధిత నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.


నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు